క్లుప్తంగా

వేల్పనూరు పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్

వెలుగోడు: వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆత్మకూరు డివిజన్ ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్ సోమవారం తనిఖీ చేశారు. గర్భిణులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. ఎంసీడీ కార్డులను తనిఖీ చేశారు. ప్రజలకు మరింత సేవలు అందించాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందుతున్నాయా లేదా అనేది గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేల్పనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అలాగే బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం –4ను తనిఖీ చేశారు. ఆయన వెంట వైద్యాధికారిణి శ్రీదేవి, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, ఏఎన్‌ఎం, స్టాఫ్ నర్స్‌లు పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్రకుమార్

వెలుగోడు: పండ్ల తోటల సాగుతో రైతులు మంచి లాభాలు గడించవచ్చని జిల్లా అంబుడ్స్ పర్సన్ రాయసం సురేంద్ర కుమార్ అన్నారు. సోమవారం పట్టణ శివారులోని గాలేరు సమీపంలో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేసుకున్న హార్టికల్చర్(మామిడి) తోటను ఆయన సందర్శించారు. మామిడి మొక్కలను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులు గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలో 9 వేల జాబ్ కార్డులు ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట ఏపీవో మల్లికార్జున, సిబ్బంది ఉన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలి

మహానంది: ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అంబుడ్స మన్ సురేంద్రకుమార్ సూచించారు. బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలో సోమవారం జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎంపీడీఓ వాసుదేవగుప్త, ఏపీఓ వసుధలతో కలిసి క్షేత్రస్థాయిలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. జిల్లాలో బండిఆత్మకూరు మండలాన్ని ప్రగతిలో మొదటిస్థానంలో నిలపాలని కాంక్షించారు. కార్యక్రమంలో ఈసీ వరదరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయాన్ని కాపాడండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నందికొట్కూరు: మండల పరిధిలోని 10 బొల్లవరం గ్రామ సమీపంలోని వేణుగోపాలస్వామి ఆలయం నేషనల్ హైవేలో భాగంగా తొలగించకుండా కాపాడాలని ఆలయ కమిటీ పెద్దలు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్‌ను కోరారు. సోమవారం కమిటీ పెద్దలు భాస్కరరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, సీతారామిరెడ్డి, డాక్టర్ మురళీధర్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, నాగయ్య, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు రామచంద్రుడు, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణయాదవ్‌లు నందికొట్కూరులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు ఫోన్ చేసి వేణుగోపాలస్వామి ఆలయ కూల్చకుండా చూడాలని కోరారు. లేని పక్షంలో ప్రత్యామ్నాయ స్థలం ఇచ్చి దేవాలయాన్ని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నేషనల్ హైవే కాంట్రాక్టర్‌తో చర్చించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కేజీ రోడ్డుపై గుంతలు పూడ్చండి

జూపాడుబంగ్లా: వర్షాల దాటికి కర్నూలు–గుంటూరు రహదారి వెంట ఏర్పడిన గుంతలను వెంటనే రోడ్లు భవనాలశాఖ అధికారులు, నేషనల్ హైవే అధికారులు పూడ్చించాలని సీపీఐ నాయకులు రమేష్‌బాబు, శేషన్న డిమాండ్ చేశారు. సోమవారం మండ్లె వద్ద రోడ్డుపై ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. నందికొట్కూరు నుంచి 80బన్నూరు మార్గంలో మండ్లెం పుల్లయ్యబావి సమీపంలో, మండ్లెం గ్రామంలో, జూపాడుబంగ్లా బస్టాండు సమీపంలో రోడ్డు పై గుంతలు ఏర్పడినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాల దారులు గుంతలను గమనించకపోవటంతో కిందపడి తీవ్రగాయాలపాలవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజు, మౌలాలి, భాష, మండ్లెం గ్రామస్తులు పాల్గొన్నారు.

పంటలకు ఊపిరిపోసిన వరుణుడు

- ఫైర్లు వాడుతున్న దశలో కురిసిన వర్షం
- ఆత్మకూరు డివిజన్‌లో 9 వేల హెక్టార్లలో పంటల సాగు
- వర్షాలు తగ్గితే విత్తు వేసేందుకు సిద్ధంగా ఉన్న అన్నదాతలు





వర్షాలకు ఊపిరి పీల్చుకున్న మొక్కజొన్న, పత్తి పంటలు

ఆత్మకూరు: ఈ ఏడాది మే, జూన్ ప్రారంభంలోనే ఓ మోస్తరు వర్షాలు కురవడంతో కొందరు రైతులు మందస్తుగా ఖరీఫ్ పంటలు సాగు చేశారు. ఆ తరువాత వరుణుడు సహకరించకపోవడంతో పంటలను దున్నేసే పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో బంగాళఖాతంలో ఏర్పడిన తుపాను వాడుతున్న పంటలకు ఊపిరి పోసింది. డివిజన్ పరిధిలో నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో అన్నదాతలు కుదుట పడ్డారు. ఆందోళనలో ఉన్న రైతాంగానికి ఒక్కసారిగా వర్షాలు కురవడంతో పంటలకు ఇబ్బందిలేదనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నారు. వర్షాలు కాస్త తెరిపిస్తే మిగిలిన రైతులు విత్తనాలు వేసేందుకు సిద్ధమయ్యారు.

11 వేల హెక్టార్లకు పైగా పంటల సాగు

ఆత్మకూరు డివిజన్ పరిధిలో నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ నెల 23న 77.8 మిమీ వర్షం కురిసింది. శనివారం 33.8 మిమీ, శుక్రవారం 11.6 మి.మీ , గురువారం 14.8 మిమీ వర్షం కురిసింది. డివిజన్‌లో అన్ని మండలాల్లో వర్షాలు కురవడంతో రైతులు సాగు చేసిన పంటలకు ఈ వర్షాలు ఊరటనిచ్చాయి. ప్రస్తుతం రైతులు 60 శాతం పైగా పంటలు సాగు చేయగా, మిగిలిన 40 శాతం వర్షాలు తగ్గితే విత్తు వేసేందుకు సమాయత్తమయ్యారు. డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో మొక్కజొన్న, మెట్టవరి, కంది, పత్తి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 11వేల హెక్టార్లకుపైగా రైతులు పంటలు వేయగా, మిగిలిన 4 వేల హెక్టారుల్లో రైతులు వానలు తగ్గితే విత్తు వేయనున్నారు.

మొక్కజొన్నపై రైతన్న ఆసక్తి

ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఈ ఏడాది మొక్కజొన్న పంటపై దృష్టి సారించారు. అత్యధికంగా ఈ పంట సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే డివిజన్ పరిధిలో 8,495 హెక్టారుల్లో ఈ పంట సాగు చేయగా, మరో 2వేల హెక్టారుల్లో ఈ పంట వేయనున్నారు.

వర్షం కురవక పోతే నష్టపోయే వాళ్లం



ఖరీఫ్‌లో 4 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాం. వర్షాలు కురుస్తాయని భావించి, పంటలు వేస్తే 10 రోజులుగా వర్షాలు లేకపోవడంతో వేసిన పంటలు కళ్ల ముందే ఎండే పరిస్థితి ఏర్పడింది. ఈ దశ లో పంటలు ధ్వంసం చేయాలని భావించాం. ఇప్పటికే ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి పెట్టాం. నష్టవస్తుందని భావించిన తరుణంలో వర్షాలు కురవడంతో పంటలకు జీవం వచ్చింది.

– రమేష్, శ్రీపతిరావుపేట

పంటలు చేతికి వస్తాయని ఆనందంగా ఉంది



వేసిన పత్తి మొక్కజొన్న పంటలు వాడు దశలో వర్షాలు కురవడంతో పంటలు చేతికి వస్తాయని నమ్మకం ఏర్పడింది. కొన్ని రోజులుగా వర్షాలు కురవకపోవడంతో పెట్టుబడి పెట్టి నష్టపోతాయని భావించాం. ఈ తరుణంలో వరుణుడు చల్లని చూపుతో పంటలు పండుతాయని ఆనందంగా ఉంది.

– హనుమంతరెడ్డి, ఆత్మకూరు

విత్తు వేసేందుకు సమయం ఉంది



ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు మందకొడిగా ఉండడంతో మిగతా కొద్ది మంది రైతులు ఖరీఫ్ సాగుకు ఆలస్యం అయింది. ప్రస్తుతం ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు తగ్గితే మరో 5, 6 రోజుల్లో మొక్కజొన్నతో పాటు ఆగస్టు 10వ తేదీలోపు మెట్టవరి, మినుము పంట సాగు చేసేందుకు అవకాశం ఉంది. రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. సకాలంలోనే విత్తు వేసుకోవచ్చు.

– విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయాధికారి, ఆత్మకూరు

శివపురం చెరువుకు గండి

- గతంలో పడిన చోటే మళ్లీ..
- భయాందోళనలో గ్రామస్తులు, రైతులు



చెరువు పడిన గండిని చూపుస్తున్న రైతులు

కొత్తపల్లి: వారం రోజులగా మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. ఎక్కడచూసినా వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. గ్రామాల సమీపంలోని చెరువులకు జలకల సంతరించుకుంటోంది. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రతి రోజు మోస్తరు వర్షాలు పడుతున్నాయి. వర్షం ధాటికి మండలంలోని సోమవారం శివపురం గ్రామ శివారుల్లో ఉన్న ఈర్ల చెరువుకు గండిపడింది. చెరువులోని నీళ్లు రైతులు సాగుచేసుకుంటున్న పంట పొలాల్లోకి చెరుతున్నారు. దీంతో పంటలు దెబ్బంతింటాయని, గండి పెద్దదై చెరువు కట్టతెగితే పంటలు నాశనమవుతాయని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం గండిపడ్డ చోటే మళ్లీ పడిందని రైతులు తెలిపారు. అప్పటి అధికారులు నిర్లక్ష్యంగా నాణ్యత లేకుండా నాసిరకంగా చెరువుకుపడ్డ గండిని పూడ్చడంతో మరలా గండి పడిందని ఆరోపిస్తున్నారు. ఇంకా వర్షాలు ఆగక పోవడం, తరచు వర్షాలు కురుస్తుండడంతో గ్రామస్తుల్లో భయం ఎక్కువవుతోంది. అధికారులు స్పందించి తీవ్ర నష్టం జరగక ముందే గండిని పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరుడు

మహానంది: ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించిన విధంగా దేవదాయశాఖ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు పెంచడంపై మహానంది ఆలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం దేవస్థానం కార్యాలయంలో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ధర్మకర్త మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా రవిశంకర్ అవధాని

మహానంది దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వేదపండితులు రవిశంకర అవధానిని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, ఉపాధ్యక్షుడిగా సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు, కార్యదర్శిగా మల్లికార్జున, జాయింట్ సెక్రటరీగా ముఖ్య అర్చకులు రాజమాణిక్యశర్మ, ట్రెజరర్‌గా నాగభూషణంతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.


ఆత్మకూరులో 2.01 మిమీ వర్షం

ఆత్మకూరు: పట్టణంలో, మండలంలో సోమవారం 2.01 మిమీ వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇటీవల వర్షం తీరును పరిశీలిస్తే ఆదివారం 2.6 మిమీ, శనివారం 23.4 మిమీ వర్షం కురిసింది. 3 రోజులుగా అడపాదడపా వర్షాలు కురవడంతో రైతులు సంబరపడుతున్నారు. కాగా తుపాను ప్రభావం మరో 4 రోజులు పాటు కొనసాగనుండడంతో భారీ వర్షం కురిస్తే బాగుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆత్మకూరు మండలంలో వర్షాకాలం ప్రారంభమై 2 నెలలు గడుస్తున్నా చెరువులకు నదులకు వరద నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వేకువజామున కురుస్తున్న వర్షాలు రైతులకు కొంత ఊరటనిచ్చిన భారీ వర్షాల కోసం రైతాంగం ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎడతెరపి లేకుండా వాన

జూపాడుబంగ్లా: సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఎడతెరపిలేకుండా వర్షం కురవటంతో ప్రజలు ఇళ్లల్లోనే ఉండిపోయారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 4.4మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నందికొట్కూరు మండలంలో అత్యధికంగా 13.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా పాములపాడులో 2.8మిల్లీమీటర్లు నమోదైనట్లు తెలిపారు. కొత్తపల్లిలో 9.4ఎం.ఎం, మిడుతూరులో 6.4ఎం.ఎం, పగిడ్యాలలో 6.2ఎం.ఎం, జూపాడుబంగ్లాలో 4.4మిల్లీమీటర్ల వర్షం కురిసిందని వివరించారు.

దేవదాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీని కలిసిన శ్రీశైలం ఈఓ



స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను స్పెషల్‌చీఫ్ సెక్రటరీకి అందజేస్తున్న ఈఓ ఎస్ లవన్న

శ్రీశైలంటెంపుల్: రాష్ట్ర దేవాదాయశాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ గా బాధ్యతలు స్వీకరించిన ఆర్ కరికాల్ వలవెన్ ను శ్రీశైలదేవస్థానం ఈఓఎస్ లవన్న మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ కి కమీషనర్ ఎస్ సత్యనారాయణ సమక్షంలో దేవస్థానం తరఫున వేదపండితులు వేదాశీర్వచనాలతో శేషవస్త్రాలు, స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

'మణిపూర్' నిందితులపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు: మణిపూర్‌లో మహిళలపై దాడులకు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో రెండు వర్గాల మధ్య దాడులు జరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. అక్కడ ఉన్మాదులు ఆయుధాలు ధరించి దళిత మహిళలపై దాడులు నిర్వహించి చంపేస్తామని బెదిరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సురేంద్ర, ఇస్మాయిల్, శివకుమార్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

కాల్వలు తవ్వించాలి

కొత్తపల్లి: కొత్తపల్లి నుంచి హరిహరం పొలాలకు వెళ్లే రహదారి వెంట రొడ్డుకిరువైపులా కాల్వలు తీయించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటశివుడు కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గతంలో హరిహరం, ఇప్పల బరక రోడ్డుకు ఇరువైపుల ప్రభుత్వం కాల్వలు తీయించిందని, అప్పుడు వర్షపునీరు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పోయేదన్నారు. ప్రస్తుతం రైతులు కాల్వలు పూడ్చడంతో వర్షపునీరు రోడ్డుపై నిలుస్తోందన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కాల్వలు ఏర్పాటు చేయాలని కోరారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పగిడ్యాల: స్వయం సహాయక పొదుపు మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మండల సమాఖ్య అధ్యక్షురాలు విజయమ్మ, శ్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అధ్యక్షతన కార్య నిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ సంఘ సభ్యులు నెల నెలా నిర్వహించే పొదుపు లావాదేవీల పుస్తక నిర్వహణను బుక్ కీపర్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. జీవనోపాధులను మెరుగు పర్చుకోవడానికి ప్రభుత్వం రూ. 35 వేల సబ్సిడీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల స్థాపనకు రుణం మంజూరు చేస్తోందని వివరించారు. బుక్ కీపర్లు వీటిపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు, లీగల్ కో ఆర్డినేటర్ ఇస్మాయిల్, ఏపీఎం బి. శ్రీనివాసులు, సీసీలు జంగిలయ్య, యాపిలయ్య, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: మండలంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మంగళవారం పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ సిద్ధాపురం గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని

నేడు వెలుగోడు పట్టణంలో..

వెలుగోడు: పట్టణంలోని 4వ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి తెలిపారు.

ఆర్‌బీకే నూతన భవనం ప్రారంభం

పట్టణంలో నూతనంగా నిర్మించిన 3వ రైతు భరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మంగళవారం ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మూడు గ్రామాల్లో..

మహానంది: మండలంలోని సీతారామాపురం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి తెలిపారు. దీంతో పాటు బండిఆత్మకూరు మండలం నారాయణాపురం, చిన్నదేవలాపురం గ్రామాల్లోనూ కార్యక్రమం ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

నేడు 'జగనన్న సురక్ష'

పగిడ్యాల: మండల పరిధిలోని లక్ష్మాపురం సచివాలయం– 1లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పాములపాడు మండలంలో..

పాములపాడు: మండలంలోని వేంపెంట, జూటూరు–1 గ్రామాల్లో మంగళవారం నిర్వహించనున్న జగనన్న సురక్ష శిబిరానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ రానున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ సోమవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వేంపెంట, 11 గంటలకు జూటూరు–1 గ్రామాలకు రానున్నారని తెలిపారు.

నేడు పారుమంచాలలో ..

జూపాడుబంగ్లా: నేడు మండలంలోని పారుమంచాల గ్రామంలో సర్పంచ్ మాధవరం ప్రకాశం అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

ఓంకార సిద్ధేశ్వరస్వామికి రుద్రాభిషేకం



మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రమైన ఓంకారం క్షేత్రంలో కొలువైన శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామికి సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో అర్చకులు చక్రపాణిశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. సోమవారం స్వామివారికి ప్రీతికరం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

80బన్నూరులో 45 ఏళ్ల తర్వాత పీర్లపండుగ



80బన్నూరులో కొలువుదీరిన గోకారమయ్య పీరు

జూపాడుబంగ్లా: 45ఏళ్ల అనంతరం మండలంలోని 80బన్నూరు గ్రామస్తులు ఐక్యమత్యంగా పీర్లపండుగను జరుపుకుంటున్నారు. రెండు రోజుల క్రితం గోకారమయ్య పీరును గతంలో కొలువుంచిన స్థలం గ్రామంలోని వేపచెట్టు రచ్చబండ వద్ద కొలువుచేశారు. ఈనెల 26నుంచి గోకారమయ్య పీర్ల పండుగ వేడుకలను ప్రారంభించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 45ఏళ్ల క్రితం గ్రామస్తులు గ్రామంలో అంగరంగ వైభవంగా పీర్లపండుగను జరుపుకునేవారట. అనివార్య కారణాల వల్ల గ్రామంలో పీర్లపండుగను నిలిపివేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో గ్రామంలోని పీర్లచావిడిలో గోకారమయ్య, మౌలాలి, అలీఅక్బర్, ఇమాంఖాసీం పీర్లను కొలువుంచి పండుగను ఘనంగా జరుపుకునేవారట. పీర్లపండుగ నిలిచిపోవటంతో గ్రామంలోని పీర్లను ఊరేగిచేవారు విక్రయించినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గోకారమయ్య పీరును గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సగినేల గ్రామస్తులకు ఇచ్చాడు. అక్కడి గ్రామస్తులు పీర్లపండుగను జరుపుకోలేక కోడుమూరు గ్రామానికి చెందిన జనార్దన్‌గౌడు అనే వ్యక్తికి ఇచ్చారు. విషయం తెలుసుకున్న కృష్ణమ్మ అనే వృద్ధురాలు, షేక్షావలి, చాంద్‌బాషాలు కోడుమూరుకు వెళ్లి జనార్దన్‌గౌడుకు రూ.5వేలు చెల్లించి గోకారమయ్య పీరును పక్షం రోజుల క్రితం 80బన్నూరు గ్రామానికి చేర్చారు. గ్రామస్తులంతా ఏకమై ఐక్యమత్యంగా చందాలు పోగుచేసుకొని రెండు రోజుల క్రితం గోకారమయ్య పీరును గ్రామంలోని వేపచెట్టు రచ్చబండ వద్ద కొలువుచేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన పీర్లు ఎక్కడున్నాయో తెలుసుకొని వచ్చే ఏడాది పీర్లపండుగనాటికల్లా వాటిని గ్రామానికి చేర్చుతామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు



తాటిపాడు గ్రామంలో కొలువుదీరిన పీర్లు

జూపాడుబంగ్లా: మొహర్రం వేడుకల్లో భాగంగా సోమవారం మండలంలోని తాటిపాడు, తంగడంచ, జూపాడుబంగ్లా, మండ్లెం, తరిగోపుల, పోతులపాడు, తర్తూరు, పారుమంచాల తదితర గ్రామాల్లోని పీర్లచావిడుల్లో పీర్లదేవుళ్లు కొలువుదీరారు. ఈనెల 26 నుంచి మొహర్రం వేడుకలు ప్రారంభం కానున్నట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. ఈనెల 26న చిన్నసరిగెత్తు, 27న పగలు సరిగెత్తు, 28న పెద్దసరిగెత్తు నిర్వహించటంతో పాటు 29న పీర్లు ఏటికి వెళ్తాయని వెల్లడించారు.

అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు

జూపాడుబంగ్లా: మొహర్రం వేడుకల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ వెంకటసుబ్బయ్య సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీర్లచావిడీల వద్ద నిత్యం ఇద్దరు కాపలా ఉండాలని సూచించారు. ఎలాంటి తగాదాలకు తావులేకుండా కులమతాలకు అతీతంగా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. వేడుకల్లో ఎవరైనా తగాదాలకు పాల్పడినా, అలజడులు సృష్టించినా కేసులు నమోదుచేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

బుక్ కీపర్ డబ్బులు కాజేశాడు



ఏపీఎం శ్రీనివాసులుకు సమస్యలు విన్నవిస్తున్న గాజులపల్లె ఆర్‌ఎస్ పొదుపు మహిళలు

మహానంది: పొదుపు గ్రూపు మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించామని, అయితే మా గ్రూపులకు వీఓఏ(బుక్‌కీపర్)గా పనిచేస్తున్న కిరణ్ బాబు తన సొంత ప్రయోజనాల కోసం డబ్బు వాడుకున్నాడని పొదుపు మహిళలు సోమవారం ఆందోళనకు దిగారు. బుక్కాపురంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఏపీఎం శ్రీనివాసులకు వినతిపత్రం అందించారు. అలాగే బుక్‌కీపర్ చేసిన మోసాలపై ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదర్శ గ్రామ ఐక్యసంఘం మహిళలు మాట్లాడుతూ గ్రామంలోని మూడు సంఘాలకు రూ. 6,50,000 రుణాలు మంజూరు చేశారన్నారు. అయితే సక్రమంగా ప్రతి నెలా సంఘం సభ్యులు కంతుల ప్రకారం రూ. 5,56,200 కట్టారన్నారు. కానీ వీఓఏ కిరణ్‌బాబుకు కేవలం రూ. 2,67,300 మాత్రమే చెల్లించాడని చేశాడని, మిగిలిన రూ. 2,88,900 సొంత ప్రయోజనాల కోసం వాడుకుని దుర్వినియోగం చేశాడని ఆరోపించారు. ఈ విషయంపై ఏపీఎం మాట్లాడుతూ బుక్‌కీపర్ కిరణ్‌కుమార్ పొదుపు డబ్బులు దుర్వినియోగం చేసిన విషయం వాస్తవమేనన్నారు. గతంలోనే పలుమార్లు హెచ్చరించినా తిరిగి చెల్లించి తప్పు సరిదిద్దుకుంటానని చెప్పాడన్నారు. కానీ ఇంత వరకు చెల్లించలేదని, పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదని చెప్పారు. గ్రామంలో విచారణ చేసి తొలగించామని, కానీ కొంత మంది ఆయనకు మద్దతిస్తున్నారన్నారు.

స్పందన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

పగిడ్యాల: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారానికి కృషి చేయాలని తహసీల్దార్ భారతి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజా వినతులను స్వీకరించారు. స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యల నిమిత్తం కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు అధికారులు డుమ్మా

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన జూపాడుబంగ్లా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 26 శాఖల అధికారులుండగా కేవలం తొమ్మిది మంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. స్పందన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు తమ సమస్యలేమి పరిష్కరిస్తారని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. అందుకే వ్యయ, ప్రయాసలైనా జిల్లా కేంద్రమైన నంద్యాలకు వెళ్లి కలెక్టర్‌కు సమస్యలను విన్నవించుకొంటున్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం రస్తాను దున్నేశారని ఫిర్యాదు

పాములపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం– 2కు రస్తా లేదంటూ స్థలాన్ని దున్నేస్తున్నారని ఐసీడీఎస్ సూపర్‌వాజర్ లలితప్రభావతి, అంగన్‌వాడీ టీచర్ నాగమ్మలు ఎంపీడీఓ గోపీకృష్ణకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో వారు సమస్యను విన్నవించారు. వారు మాట్లాడుతూ 1990వ సంవత్సరంలో గ్రామ పెద్దలు అంగన్‌వాడీ కేంద్రం కోసం కలబండి లింగన్న అనే వ్యక్తి వద్ద 15 సెంట్లు కొనుగోలు చేసినట్లు చెప్పారు. 1992లో భవన నిర్మాణం చేపట్టారన్నారు. అప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం కొనసాగతుందని చెప్పారు. అయితే ఇటీవల పాములపాడుకు చెందిన నాగరాజు అనే వ్యక్తి ఆ స్థలం తమదని, ఇక్కడ రస్తా లేదని కేంద్రం ముందు సేద్యం చేశాడని తెలిపారు. గతంలో గ్రామ సర్పంచులు మట్టి రోడ్డు సైతం వేశారని వివరించారు. అలాగే మండలంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కోరారు.

నేడు డాక్యుమెంట్ల పరిశీలన

ఆత్మకూరు: మండలంలో ఆత్మకూరు, కరివేన, నల్లకాల్వ గ్రామాల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి ఎన్‌హెచ్ 167కేలో రహదారిలో పొలాలు కోల్పోయిన రైతులు డాక్యుమెంట్ల పరిశీలనకు హాజరు కావాలని ఆత్మకూరు తహసీల్దార్ ఉమాదేవి, ఆర్ఐ హరికృష్ణ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పట్టణంలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఈ నెల 26వ తేదీన పై గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు జాతీయ రహదారుల్లో పొలాలకు సంబంధించిన వివరాలతో కూడిన ఒరిజినల్ డాక్యుమెంట్లు, ఈసీ పట్టాదారుని పాస్‌పుస్తకాలు, టైటిల్ డీల్, అడంగల్, కట్టడాలు ఏమైనా ఉన్నచో వాటికి సంబంధించిన ఆమోదిత ప్లాన్లు, పన్ను అసెస్మెంట్, భూమి అను భవ పత్రాలు తీసుకుని రావాలని కోరారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు సాజన్య

కొత్తపల్లి: క్షయ వ్యాధిని నిర్మూలించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని వైద్యాధికారి సౌజన్య, మహమ్మద్ జబ్బీర్ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రమఠం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అవరణలో అశ్విని హాస్పిటల్, సేవ భారతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఉచిత మొబైల్ ఎక్స్‌రే క్యాంప్‌ను ఆత్మకూరు టీబీ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని వైద్యాధికారి సౌజన్య, గ్రామ సర్పంచ్ బాల ఎల్లయ్య ప్రారంభించారు. ఎక్కువగా జనాల, సిద్దేశ్వరం, బలపాలతిప్ప, ఎర్రమఠం, ముసలమడుగు, పెద్ద గుమ్మడాపురం చెంచు గూడేలకు చెందిన చెంచులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సేవభారతి జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, కోఆర్డినేటర్ ఎల్లయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ చంద్ర శేఖర్, టీబీ సూపర్‌వైజర్లు మస్తానయ్య, రవి కుమార్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.